# కవి సమ్మేళనము

అమ్ముల లక్ష్మీనారాయణ

భార్యలేని కవి చక్రవర్తికీ, భర్తలేని మధుర కవయిత్రికీ కవి సమ్మేళనంలో సంబంధం కలిసింది సంబంధం అంటే చెడు అర్థం తీసుకోక స్నేహమన్నమాట. బిరుదులు వాళ్ళు పెట్టుకొన్నవో, ఎవరైనా యిచ్చినవో కానీ వాళ్ళ మాటలను బట్టి మాత్రం వాళ్ళు కవులని ఒప్పుకోవలసిందే వీరిద్దరికీ కల్సిన స్నేహం చూసి మిగిలిన కవిబ్రహ్మలంతా అబ్బుర పడ్డారు. కవి సమ్మేళనం అంతా మధుర కవయిత్రీ, కవి చక్రవర్తి స్నేహ సంబంధాలు గురించే సెగలు పొగలెగసినయ్. ఎవ్వరేమనుకుంటే యేం వాళ్ళుమాత్రం చిలుకా గోరువంకల్లాగా తిరుగుతున్నారు. వారి స్నేహం ఇనుమడించింది. సమ్మేళనం సమాప్తమయింది. సంబంధం మాత్రం మామూలుగనే వుంది.

మామూలుగా ఏవో చమత్కరించుకోవటం అలవాటుగా కవులకు. ఏదో సంభాషణలో "ఏమండీ కవిచక్రవర్తిగారూ, మీ ఆశయాలు కొన్ని చెప్పండి వింటాను" అంది మధుర కవయిత్రి.

"నేను ఈమధ్య అందం— ఆనందం అని ఒక వ్యాసం వ్రాశాను. దానిలో నా ఆశయాలన్నీ వెలిబుచ్చాను. నిజం చెప్పాలంటే పిలిపించే వగలాడులూ, అలుకచేసిన అంగనలూ, లాలించే లలితాంగులూ — వాళ్ళల్లోనే వుంది అందం. నాకు నలుపురంగంటే చాలాయిష్టం (మధుర కవయిత్రి నలుపు) అలా ఆలోచిస్తే ప్రపంచంలో మనిషికి [illegible] అన్నీ నలుపే, సముద్రం నలుపు ఆకాశం నలుపు, నీగ్రో నలుపు —"

"అదేమిటండోయ్ నీగ్రోని కూడా కలిపారు" అంది కవయిత్రి —

"క్షమించండి ఏదో ప్రాస కలపటానికి చెప్పాను" నాలిక కరుచుకున్నాడు.

"ఏమిటండీ భావం కొరకు యతిప్రాసలు తీసేస్తారు కొందరు ఆశు కవులు. యతిప్రాసల కొరకు భావం తీసేస్తారు కొందరు నాటు కవులు" అంది.

"అది సరే అది అలా వుంచండి, అసలు ఒక స్త్రీ నల్లగా వుందనుకోండి ఆమె ఏడుస్తూ వున్నదనుకోండి, [illegible], సన్నని చెక్కిళ్ళ మీద నుండి అశ్రుధారలు జలపాతంలా జారిపోతుంటే, ఆ బిందువుల్లో దీప్తికాంతి ప్రతిబింబిస్తుంటే నిజంగా నల్లని మబ్బులముందు తెల్లని మెరుపులాగా వుండదూ — అందులో లేదూ అందం? నిజానికి నా భార్య నలుపు, నా పిల్లలు నలుపు .... ఇక ఆనందం. వన్నెడిగితే మంద గమనంలో, మండు టెండలో, పెనుతుఫానుల్లోనే వుందంటాను. — స్త్రీ కాళ్ళదగ్గర కూర్చుండి నిమురుతూంటే, ప్రియురాలు కాదనీ, తాను అవుననీ సంవాదం చేస్తుంటే అక్కడవుంది ఆనందం — అదిసరే నేను చెప్తాను మీ ఆశయాలు కొన్ని చెప్పండి" అప్పటికి మంచినీళ్ళు తాగవలసిన స్థితికి వచ్చాడు కవిచక్రవర్తి —

"ఏం చెప్పమంటారు? ఆడవాళ్ళను సమర్థిస్తే పక్షపాత మంటారు. నిజం చెప్పండి పెళ్ళికొడుకు పెళ్ళికూతుర్ని చూడటానికి వస్తాడు. ఎగాదిగా చూస్తాడు. పెళ్ళిపెద్దలు పదిమంది వచ్చి — పిల్ల ఆటా — పాటా, ముక్కూచెవీ, వంటా — ఏడ్వనా అన్నీ చూస్తారు. కానీ ఆ స్వాతంత్ర్యం పిల్లకిస్తారా? పిల్లకూడా పెళ్ళికొడుకు వద్దకు వెళ్ళి ఆడించి, పాడించి అతన్ని నానాతిప్పలు పెట్టి అతను ధైర్యసాహసోపేతుడో పిరికిపందో చూసిగాని పెళ్ళి చేసుకోగూడదు. నా ఆశయం ఇది. నా కథలద్వారా ప్రజలకు నచ్చజెప్పి తీరుతాను" సవాలుచేసింది మధురకవయిత్రి.

"నిజంగా నా ఆశయం అదే. ఆశయాల కల్సిన కవులుండటం చాలా అరుదు. నిజంగా మనమే జంటకవులమైతే, అంటుకు తిరుగుతూ గంటకొక కావ్యం వ్రాస్తే ఎంత బాగుంటుంది"

"అవునవును. నాదీ అదే అభిప్రాయం" కానీ మనలనుచూచి అందరూ ఏమనుకొంటున్నారో తెలుసా" అంది కవయిత్రి కొంచెం భయంతో

"ఏమనుకొంటే మాత్రం మనకేమిటి? అసలు మనం యింతకాలం కలిసి తిరుగుతూ సాధించిన దేమిటి" అన్నాడు కవిచక్రవర్తి. మరి దానిలో అర్థం ఏమిటో?

అందుకు స్పందించింది కవయిత్రి — "అప్పుడు ఏదైన సాధించాలంటె సమయంకావాలి, ఉదాహరణకు యిప్పుడు పిల్లలు పుట్టాలనుకుంటూ మనుకోండి. ఒక్కసారే పుడతారా దానికీ ప్రయత్నం దైవబలం అక్కర్లా" —

మంచి ఉదాహరణే సంపాదించింది.

"మీరు 'వదిన' చూశారా" — అడిగాడు కవి.

"నేను బావా—మరదళ్ళను కూడా చూశాను" మాటకుమాట, అన్నట్లుగా అంది కవయిత్రి.

"వదిన చాలా బాగుంటుంది. వదినను చూసినంతసేపూ నాకూ ఒక వదిన వుంటే ఎంత బాగుండు ననిపించింది" — కథ ధోరణి మారింది.

"బావా — మరదళ్ళను చూసినప్పుడు నేనూ అలాగే అనుకున్నాను. నాకూ ఒక బావ వుంటే ఎంత బాగుండేది అని" — కవయిత్రి కొంటె చూపు చూచింది.

"నిజంగా నేనేనీకు బావనై, నీవే నాకు మరదలవై ఈ నవ వసంతశోభలో నందన వనంలో, ప్రేమరాజ్యంలో తేలియాడుతూ మధుర స్వప్నాలను జీవిత సత్యాలుగా చేసుకొంటే — ఏంచెప్పను ప్రియురాలా! రా! నా కవుగిలిలో నిన్ను బంధిస్తాను. నామాట కాదనకు. ఇంతకాలము మన స్నేహము సార్థకం చేసుకొందాం. రా!!" —

తన్మయత్వంలో కవిత్వం పొంగి పొర్లింది. — చిన్నకాలపు స్నేహితుని ఆహ్వానించ బాహువులు చాచి వెళ్ళే మిత్రుడిలాగా — అబల మీదిమీదికి పోబోయ్యాడా రసికాగ్రగణ్యుడు.

"ఛీ దుర్మార్గుడా, చనువిచ్చినందుకు నువ్విలా తయారయ్యావా నీకిదేశాస్తి" అంటూ అచట వున్న ఒక దుడ్డుకర్ర తీసి నెత్తిన పెట్టబోయింది కవిచక్రవర్తికి —

తక్షణం సాష్టాంగ పడ్డాడామె కాళ్ళముందు కవిచక్రవర్తి సైతము —

"పతివ్రతా శిరోమణి! కాంతా రత్నమా!— నీ మనస్తత్వం తెలుసుకుందామనీ, నీ ఆత్మనిగ్రహము పరీక్షిద్దామనీ నేనీపని చేశాను. నువ్వు నిజంగా స్త్రీజాతికి ఒక ఆభరణం. పతితల కొక్క చెంపపెట్టు. ఇప్పుడు నీయొక్క అసలు స్వరూపము అర్థమైనది. నువ్వొక శీలవతివి, గుణవతివి. నేనొక కవిని. మగువల మనసులోని మర్మములు తెలుసుకోవటం చాలా శ్రమ అంటారు. స్త్రీ హృదయం నడి సముద్రంలోని గుండుసూది అంటారు. దాని వెదకటం చాలా కష్టమట. నా అంతటివాడు సైతము నీమాటలలోని రెండవ అర్థము మాత్రమే తీసుకొని నిన్ను అన్యథా తలంచాను. చనువిచ్చి సజ్జనుండి చక్కగా మాట్లాడితే అవి సోదరీ సరసవచనాలనుకోక, ప్రియురాలి ప్రేమవచనాలనుకొన్నాను. తప్పుదోవలో పడ్డాను. బుద్ధివచ్చింది. ఇప్పుడు నీవు నాకు సహోదరివి. నాకు సోదరీభిక్ష పెట్టు." —ఇక దాటిగా బట్టిపట్టి పాఠం అప్పజెప్పినట్లు పల్కించాడు కవి చక్రవర్తి.

మధుర కవయిత్రి మాత్రం తక్కువతిన్నదా!

"అయ్యో! అలా అంటారేమండీ! నేను కవయిత్రిని. పురుషులు సబలలట. స్త్రీలు అబలలట. దీనిలో అర్థం తెలుసుకుందామనే నేను మీ మీద కర్ర ఎత్తాను. నాకు మీమీద ఏ దుర్భావమూ లేదు. ఒక అబలగా చిత్రించబడిన స్త్రీ, తన్నబోతే తప్పించుకొని క్షమాపణ కోరుకొనే సబలగా చిత్రించబడ్డ పురుషులుంటారనుకోలేదు. నాకిప్పుడు తెలిసింది. ఇలాంటి సన్నివేశాల్ని నా కథల్లో కూడా చిత్రిస్తాను. మీలోని బహిరంగ గాంభీర్యం చూచి, గాంభీర్యానికి తగ్గ ధైర్యమున్న దనుకొన్నాను. మీ మగవారంతా ఇంతేనా"

ఎంత తేలికగా కట్టింది మగవారందరినీ — ఒక తుఫాను వెలిసింది. నిశ్శబ్దం ఆవరించింది.

"ఏమైనా అన్నలాంటివాడ్ని అవమానిస్తా వనుకోలేదు" ఏడ్పు మొహం పెట్టి అన్నాడు కవి చక్రవర్తి.

"అబలను చూచి బేలవైపోతా వనుకోలేదు." ప్రపంచయుద్ధంలో విజయం సంపాదించిన వాని లాగా పోజుపెట్టి సుమధురంగా అంది మధుర కవయిత్రి.

"అమాయకుడ్ని అనవసరంగా ఆగ్రహిస్తా వనుకోలేదు" — కవి.

"నిష్కల్మషురాల్ని, నిరపరాధిని నిందిస్తా వనుకోలేదు" — కవయిత్రి.

"పరపురుషుడ్ని పరిహసిసా వనుకోలేదు"— కవికి కోపం ఎక్కువయ్యింది.

"పరస్త్రీని పరాభవిస్తా వనుకోలేదు" — మరింత మండిపడింది కవయిత్రి.

నన్ను పిలువునా నీరు చేస్తా వనుకోలేదు"

"నన్ను నలుగురిలో నగుబాట్లు చేస్తా వనుకోలేదు."

"మృదువైన మాటలు చూచి మధురమూర్తి వనుకున్నాను."

కోపం కొద్దిగా తగ్గింది. గారాబంగా అన్నాడు కవిచక్రవర్తి —

"చనువైన మాటలు చూచి సజ్జనుడవనే అనుకున్నాను."

కవయిత్రికూడా కొంచెం స్వరం తగ్గించింది.

ఆరిపోయె దీపం ఒక్కసారి బాగా వెలిగినట్లు "స్త్రీలు సిగ్గుచేటుగా మాట్లాడుతా రనుకోలేదు" అరిచాడు కవి.

"పురుషులు పరుషస్వరాలు పల్కుతా రనుకోలేదు" మధుర కవయిత్రి గొంతు చాలా తగ్గించింది.

ఆఖరుసారి "అన్యథా తలంచకు చెల్లీ"

"అనవసరంగా తలవంచను అన్నయ్యా!"

"వెళ్లొస్తా చెల్లీ!"

"వెళ్లిరా కన్నయ్యా!"

పాపం 'పూర్ ఫెలో' తలకాయ వంచుకొని అదేపనిగా పోయాడు. కవిసమ్మేళనం, కవి సంభాషణం, కవి సంఘర్షణం చూచినంతసేపూ నేను కూడా ఈ కథ సుఖాంత మవుతుందనే అనుకున్నా. కవి నిర్గమనం అయ్యేసరికి యింకేముంది. కథ విషాదాంత మైపోయింది. —

